క్లుప్తంగా

సీఎం సహాయనిధి పేదలకు వరం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని, ఆపత్కాలంలో పేదలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ఐజాస్ చికిత్స కోసం రూ.1,50,000, ఇటీవల మండలంలోని రాజ్‌పల్లి గేటు వద్ద గాయపడిన మున్సిపల్ కార్మికులు సిద్ధిరాములు, డంకా భాస్కర్‌ల చికిత్స కోసం ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున మొత్తం మూడు ఎల్‌ఓసీలను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా రూ.5.50 లక్షల విలువ గల మూడు ఎల్‌ఓసీ కాపీలను మంగళవారం ఆమె బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, జయరాజ్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



డాక్టర్లతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత నెలకొందని, పలు యంత్రాలు మంజూరు చేయించాలని వైద్యులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల విషయమై మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ లింబాద్రి, ధర్మారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ హిరిప్రియ, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించేందుకు చర్యలు




ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

పెద్దశంకరంపేట(మెదక్): కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ జంగం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పేటలో తహసీల్దార్ చరణ్‌సింగ్, ఎస్‌ఐ బాలరాజుతో కలసి లారీలను ఏర్పాటు చేసి ధాన్యం తరలించేందుకు లారీ ఓనర్లతో చర్చించారు. లారీలు అందుబాటులో లేక పోవడంతో అకాల వర్షాలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ధాన్యం లోడ్లను మిల్లర్లు ఖాళీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు సురేష్‌గౌడ్ తదితరులున్నారు.

ఐటీఐకి పదిలోగా దరఖాస్తు చేసుకోవాలి

రామాయంపేట(మెదక్): పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఐటీఐ చదవడానికి వీలుగా వచ్చే నెల 10 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రామాయంపేట మంజీరా ఐటీఐ ప్రిన్సిపాల్ పండరినాథ్ సూచించారు. అతి తక్కువ కాలంలో ఐటీఐ పూర్తిచేసుకొని జీవితంలో స్థిరపడటానికి ఇది మంచి మార్గమని ఆయన పేర్కొన్నారు. ఐటీఐ పూర్తి చేసుకున్న బాలికలకు సైతం మంచి అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రీషియన్ ఫిట్టర్, మెకానిక్, సీయింగ్ టెక్నాలజీ కోర్సులున్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చేనెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతీ

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయాన్ని మాధవానంద సరస్వతీ స్వామి మంగళవారం సందర్శించారు. ఆలయ పునర్నిర్మాణం పనులు, విగ్రహ ప్రతిష్ఠలు భవిష్యత్ దైవ కార్యక్రమాల నిర్వహణపై ఆయన నిర్వాహకులకు సూచనలు అందజేశారు. ఆలయంలో పూజలు చేసి, అను గ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో విఠల్ మహారాజ్, సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ నర్సింలు, ప్రభాకర్, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. శివ్వంపేట, గోమారం, సికింద్లాపూర్, శభాష్‌పల్లి తదితర గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. సిత్యా తండాలో చంద్రనాయక్ ఇంటి పై కప్పు రేకులు పూర్తిగా తొలగిపోయాయి. వర్షంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిపోయింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం సకాలంలో తుకం వేయకపోవడంతో తడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

మనోహరాబాద్(తూప్రాన్): అకాల వర్షానికి మండలంలో పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన ధాన్యం తడిసింది. లింగారెడ్డిపేట్, రంగాయపల్లి ఐకేపీ కేంద్రాల వద్ద కాళ్ళకల్, దండుపల్లి, మనోహరాబాద్‌ల్లో ఆరబోసిన ధాన్యం ఎక్కడివక్కడే తడిసి ముద్దాయి. లారీలు లేవనే సాకుతో పలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



శివ్వంపేట(నర్సాపూర్): శభాష్‌పల్లిలో ధాన్యం కుప్పల్లో చేరిన వర్షం నీరు



శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో కురుస్తున్న వర్షం.. తడుస్తున్న ధాన్యం



శివ్వంపేట(నర్సాపూర్): సిత్యా తండాలో..



మనోహరాబాద్(తూప్రాన్): తడిసిన ధాన్యం..

ధాన్యం కొనేదెప్పుడు ?

అల్లాదుర్గం(మెదక్): ధాన్యం తెచ్చి 15 రోజులు గడుస్తున్నా.. ధాన్యం కొనడం లేదని, కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో సమాచారం ఇవ్వడం లేదని, అసలు ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అల్లాదుర్గంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్లాదుర్గం జెడ్పీ పాఠశాల ఆవరణలో ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పడంతో ధాన్యం అక్కడికి తెచ్చామని, మరో దగ్గర కొనుగోలు చేస్తుండటం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులను అధికారులు వేధింపులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారమే ఇవ్వడం లేదన్నారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు. రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



అల్లాదుర్గంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ నిధులను విడుదల చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెదక్, హవేళిఘనాపూర్ మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే హవేళిఘనాపూర్ మండలంలోని రాజ్‌పేట గ్రామంలో బీరప్ప జాతరలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీమా చెక్కు అందజేత

హవేళిఘనాపూర్ మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన కల్లూరి నర్సింలు, గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివరాములు వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందారు. వారు బీఆర్‌ఎస్ సభ్యత్వాన్ని కలిగి ఉండడంతో పార్టీ ద్వారా ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున రూ.4 లక్షల బీమా మంజూరైంది. దీంతో ఆ చెక్కులను ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, ఎంపీపీలు, ఎంపీడీఓలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొల్చారం(నర్సాపూర్): ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జేడీఏ



చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో..

కొల్చారం(నర్సాపూర్): జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేసే కొనుగోలు కేంద్రాల సిబ్బంది ధాన్యంలో చెత్త, పొల్లు లేకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి ఆశాకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని పోతంశెట్టిపల్లిలో ఐకేపీ ద్వారా చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేడీఏ ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ధాన్యం బస్తాలు త్వరగా రైస్‌మిల్లులకు చేరేలా ఏర్పాట్లు చేశామన్నారు. తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రతి భ, ఐకేపీ సెంటర్ ఇన్‌చార్జ్ యాదగిరి ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి జయరాజ్ సందర్శించారు. లారీల కొరతతో ధాన్యం తరలించలేకపోతున్నట్లు సర్పంచ్ స్వర్ణలతభాగ్యరాజ్ ప్రత్యేక అధికారికి తెలిపారు. ఈ పరిశీలనలో ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఉపసర్పంచ్ సంతోష, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సీసీ అంజయ్య, సంతోష, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



బోనమెత్తుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పక్కన సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లిలోని ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం సర్పంచ్ ఎల్లం ఆధ్వర్యంలో గ్రామస్తులు బోనాలను ఊరేగించి, అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బోనం ఎత్తుకున్నారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామాగౌడ్, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు శేఖులు, రమేశ్, సంజీవ్, నాయకులు నవీన్‌రావు, కిషోర్‌గౌడ్, శ్రీధర్‌గుప్తా, లింగం, రాజిరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని పలు గ్రామాల అభివృద్ధికి రూ.60 లక్షల నిధులను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మంజూరు చేసినట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ.. వివరాలు వెల్లడించారు. మండలంలోని వెంకట్రావుపల్లి పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, సోమేశ్వరాల కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, మడూర్‌లో ముదిరాజ్ భవన నిర్మాణానికి రూ. 5లక్షలు, ధరిపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, మిర్జాపల్లిలో కమ్యూనిటీ హెల్త్ భవన నిర్మాణానికి ఎస్‌హెచ్‌ఎం నిధుల ద్వారా రూ. 20 లక్షలు, నార్సింగి మండలం శేరిపల్లి గ్రామ మున్నూరుకాపు కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సుధాకర్‌రావు, సర్పంచ్‌లు యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సమ్మ, సిద్ధిరామ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు సుధాకర్, మహిపాల్‌రెడ్డి, రవి, తిరుపతిరెడ్డి, పర్శరామ్, ప్రవీణ్, సురేశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు

డివిజన్ సాధనే లక్ష్యంగా పాదయాత్ర

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా ఆందోళనకు మద్దతుగా ఉద్యమంలో పాల్గొంటానని నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయకుమార్ వెల్లడించారు. ఆయన మంగళవారం అఖిలపక్షం ప్రతినిధులతో కలిసి రామాయంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇది రామాయంపేట ప్రజల చిరకాల కోరికగా పేర్కొన్నారు. తాను అధికార బీఆర్‌ఎస్‌లో ఉన్నా.. ప్రజల సమస్యల విషయమై ఉద్యమించడానికి ఎల్లవేళలా ముందుంటానని వెల్లడించారు. రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాలను కల్పించి డివిజన్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. ఉద్యమంలో భాగంగా బుధవారం నిజాంపేట మండల కేంద్రం నుంచి రామాయంపేట వరకు వందలాది మందితో పది కిలోమీటర్లమేర పాదయాత్ర నిర్వహిస్తామని, అనంతరం రామాయంపేటలో రోడ్డుపై వంటా వార్పు, కళాకారుల ప్రదర్శన, సభ, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అధికార పార్టీలో ఉండి డివిజన్ కోసం ఉద్యమించడం ఏమిటని కొందరు అంటున్నారని, డివిజన్ ఇస్తామంటే తాను స్వచ్ఛందంగా రాజీనామా చేయడానికి సిద్ధమేనని ప్రకటించారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుట్టి అక్షయ్, నార్లాపూర్ ఎంపీటీసీ రాజిరెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గర్గుల శ్రీనివాస్, అఖిలపక్ష ప్రతినిధులు రమేశ్‌రెడ్డి, దోమకొండ యాదగిరి, అల్లాడి వెంకటేశ్, చాకలి వెంకటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయకుమార్

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో కలపాలి

వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్ప

అల్లాదుర్గం(మెదక్): వీరశైవ లింగాయత్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఓబీసీలో కలపాలని వీరశైవ లింగాయత్ లింగ బలిజ రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప డిమాండ్ చేశారు. మంగళవారం అల్లాదుర్గంలో జిల్లా వీరశైవ లింగాయత్ లింగబలిజ సమావేశం నిర్వహించి, ర్యాలీకి సంబంధించిన వాల్ పోస్టర్‌నునావిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 4న హైదరాబాద్‌లో ఓబీసీ కోసం భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సంగమేశ్వర్, యూత్ రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల శివశరణ్, జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వర్, నాయకులు వీరన్న, శేఖర్ పాల్గొన్నారు.

58వ రోజుకు చేరిన దీక్షలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం58 రోజులుగా రామాయంపేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగుతున్నాయి. కుల సంఘాలు, యువజన సంఘాలు, పలు పార్టీల కార్యకర్తలు, నాయకులు, వ్యాపారులు దీక్షలకు మద్దతు పలుకుతున్నారు.

ధ్రువీకరణ పత్రాలు ఇస్తేనే నోట్ల మార్పిడి

శివ్వంపేట(నర్సాపూర్): రద్దైన రెండు వేల నోట్లను డిపాజిట్, మార్పిడి చేసుకునేందుకు మండల కేంద్రంలోని ఇండియన్ బ్యాంకు సిబ్బంది రిక్వెస్ట్ స్లిప్ రాసిస్తేనే నోట్ల మార్పిడికి అనుమతిస్తున్నారు. పలువురు ఖాతాదారులు వారి వద్ద ఉన్న 2 వేల నోట్లను వారి ఖాతాల్లో జమ చేసుకోవడంతో పాటు మార్పిడి చేసుకునేందుకు తప్పనిసరిగా రిక్వెస్ట్ స్లిప్‌తో పాటు ఆధార్ జిరాక్స్ ఇస్తేనే ఒప్పుకుంటున్నారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకున్న నోట్ల మార్పిడి, జమ చేసుకోవచ్చని ఆర్‌బీఐ సూచనలు చేసినా.. ఇక్కడి బ్యాంకు సిబ్బంది ఒప్పుకోవడం లేదని ఖాతాదారులు అంటున్నారు. ఈ విషయమై.. బ్యాంకు మేనేజర్‌ దేవేంద్ర వివరణ కోరగా.. 2 వేల నోట్ల మార్పిడికి తప్పనిసరిగా రిక్వెస్ట్ స్లిప్ ఇవ్వాల్సి ఉంటుందని, ఖాతాల్లో జమ చేసుకునే వారి అకౌంట్‌కు కేవైసీ అనుసంధానం ఉంటే రిక్వెస్ట్ స్లిప్ అవసరం లేదని చెప్పారు.



రిక్వెస్ట్ స్లిప్ చూపుతున్న ఖాతాదారుడు

కొనసాగుతున్న పారిశుధ్య వారోత్సవాలు

నర్సాపూర్: పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో పారిశుధ్య పనులు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులు, వీధి దీపాల మరమ్మతులు, తాగు నీటి పైప్‌లైన్ మరమ్మతు తదితర పనులు చేపట్టామని ఆయన చెప్పారు. ప్రధానంగా మురికి కాల్వలను శుభ్రం చేయిస్తున్నామని వివరించారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

నర్సాపూర్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం ప్రారంభం అవగానే కౌన్సిలర్ రాజేందర్ మాట్లాడుతూ.. పలు శాఖల అధికారులు రానందున సమావేశం వాయిదా వేయాలని కోరగా, సభ్యులు సరేననడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.



మురికి కాల్వను శుభ్రం చేస్తున్న సిబ్బంది

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మల్లారెడ్డి

నర్సాపూర్ రూరల్: బీజేపీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని బీజేపీ మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మల్లారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం నర్సాపూర్‌లో మెదక్ జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ...బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది ఏళ్లలో ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలను జూన్ నెల మొత్తం ఇంటింటికి తిరిగి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి సంగాసాని సురేశ్ రాజకీయ తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా అందరూ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి, నందు జనార్దన్‌రెడ్డి, రఘువీరరెడ్డి, చిన్న రమేశ్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు అంజిగౌడ్, బాల్‌రెడ్డి, బుచేశ్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మల్లారెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ **పరామర్శ**



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని రహీంగూడ తండాకు చెందిన ఉపాధ్యాయుడు రవీందర్ – అమృత దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎంపీపీ వినోదరెడ్డి మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారులైన ఇద్దరు పిల్లలను, వృద్ధులైన వారి తల్లిదండ్రులను వారు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో చిట్కుల్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నాయకులు బన్సీలాల్, ఎంపీ విఠల్ పాల్గొన్నారు.

◆ **మోడల్ స్కూల్ ఎంట్రెన్స్ ఫలితాలు**

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు ప్రకటించారు. 2023–2024 సంవత్సరానికి గాను అధిక మార్కులు సాధించిన 100 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను పాఠశాలలో ఉంచనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తమ కుల, ఆదాయ, స్థానిక ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ జిరాక్స్, బోనఫైడ్, టీసీలు తీసుకొచ్చి పాఠశాల ప్రారంభం రోజు అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు.

◆ **ఆర్థికసాయం**

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్ననాటి స్నేహితుడికి చికిత్స కోసం పూర్వ విద్యార్థులు మంగళవారం ఆర్థికసాయం చేశారు. మండలంలోని పిల్లుట్ల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న తుజాల్‌పూర్‌కు చెందిన వెల్దుర్తి నర్సింలు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న 2002 – 2003 10వ తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం నర్సింలుని పరామర్శించి చికిత్స కోసం ఆర్థికసాయం అందజేశారు.

◆ **రేపు తిమ్మాపూర్‌కు ప్రముఖుల రాకా**

శివ్వంపేట(నర్సాపూర్): దివంగత పెద్దగొని లింగయ్యగౌడ్ విగ్రహ ఆవిష్కరణకు గురువారం పలువురు ప్రముఖులు మండలంలోని తిమ్మాపూర్‌కు వస్తున్నట్లు ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన లింగయ్యగౌడ్ విగ్రహ ఆవిష్కరణకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డితో పలువురు వస్తున్నట్లు చెప్పారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ రూరల్: ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రానివ్వమని, చివరి బస్తా వరకు కొనుగోలు చేస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని తుజాల్‌పూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అకాల వర్షాలతో రైతులు పండించిన ధాన్యం తూకం వేయడంలో కొంచెం జాప్యం జరుగుతుందని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరి బస్తా వరకు కొనుగోలు చేసి, రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఒక్కసారిగా ధాన్యం చేతికి రావడంతో లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్‌ల కొరతతో పాటు హమాలీల సమస్యతో జాప్యం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతీ రైతు సమన్వయం పాటించి తూకం వేయించుకోవాలని సూచించారు. తుజాల్‌పూర్‌కు, దళిత బంధు, అంగన్‌వాడీ భవనం, సీసీ రోడ్లకు నిధులు, రాజపేట లింక్ రోడ్డు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తుజల్‌పూర్‌తో పాటు అర్జు, వాల్యా తండాలకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని సర్పంచ్ శ్రీరాములు, వార్డు సభ్యురాలు బాబీ బాయ్ కోరగా, అర్హులైన అందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ఆయన అన్నారు. వాల్యా తండాకు బీటీ రోడ్డు కోసం రూ. కోట్లు మంజూరు చేశామని తెలిపారు. కంటి వెలుగు పథకానికి మంచి స్పందన వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలి శ్రీరాములు, జెడ్పీటీసీ బాబియ నాయక్, పీఏసీఎస్ రాజు యాదవ్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు భోగ శేఖర్, ఆంజనేయులు, యాదయ్య, వైద్య బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: తుజల్‌పూర్‌లో కంటివెలుగు శిబిరం పరిశీస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పేద, మధ్య తరగతి వారి కోసం ప్రభుత్వం గ్రామాల్లో ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ రామాకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో మంగళవారం కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాన్వీ, వైద్య సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): కంటి వెలుగు పేదలకు మేలని, ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని లింగారెడ్డిపేట్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సుగుణతో కలిసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, ఏపీఓ ఆదినారాయణ, ఆత్మకమిటీ డైరెక్టర్ భిక్షపతి, నాయకులు పెంటాగౌడ్, శైలేందర్, గ్రామ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు పద్మ, కార్యదర్శి శ్రీనివాస్, తదితరులున్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): అద్దాలను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



శివ్వంపేట(నర్సాపూర్): కంటివెలుగు శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం